
ప్రజాశక్తి
మంగళవారం 15 ఆగస్టు 2023 5
పార్వతీపురం మన్యం



18న సాలూరులో జాబ్‌మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సాలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ నెల 18న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టరు ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో జాబ్ మేళా పోస్టర్‌ను జెసి విడుదల చేశారు. మేళాలో 10 కంపెనీ ప్రతినిధులు హాజరవుతారని, కావున ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పిజి, బిటెక్, ఎంబిఎ చదివిన అభ్యర్థులు అర్హులని, ఆసక్తి గలవారు తమ వివరాలు www.apssdc.in వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టరు తెలిపారు. ఇతర వివరాలకు 6305110947, 6303493720, 7993795796 నంబర్లను సంప్రదించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకట రావు, డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్ కుమార్, నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వచ్చెననీ సభలేచేసి సంబర పడగానే సరిపోదోయీ.... అన్నాడు మహా కవి శ్రీశ్రీ. సాధించినదానికి సంతృప్తి చెంది... అదే విజయమనుకుంటే సరిపోదోయి... అని కూడా హెచ్చరించాడు. అచ్చంగా ఆ పాటను గుర్తుచేస్తోంది నేటి సమాజం. ఈ విషయంలో మన జిల్లాలో పరిస్థితులూ తీసిపోలేదు. ఏటా స్వాతంత్ర్య వేడుకల హంగామా తప్ప, దాన్ని స్ఫూర్తిగా తీసుకుని అభివృద్ధికి, అంతరాలను అంతమొందించేందుకు తగినంతగా కృషి జరగడం లేదు. శ్రీశ్రీ తన పాటలో చెప్పినట్టు కులమత, భేదాలు, వ్యక్తిగత స్వార్థ రాజకీయాలే ఇందుకు కారణం. ఫలితంగా జిల్లాలో జీవన ప్రమాణాలు పెరగడం లేదు. స్వాతత్ర్యం వచ్చి 76ఏళ్లు కావచ్చినా ఇప్పటికీ చదువును కొనుక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది.



నాగావళి నదిలో తెప్పపై బాలికను తరలిస్తున్న గిరిజనులు

- ఆకాశం అందుకునే ధరలొకవైపు
- అదుపులేని నిరుద్యోగమింకోవైపు
- కొనసాగుతున్న కుల, మత భేదాలు
- పెచ్చుమీరుతున్న పదవీ వ్యామోహాలు
- నేటికీ అభివృద్ధికి నోచుకోని గ్రామాలెన్నో

స్వాతంత్ర్యం వచ్చెనని సంబర పడగానే సరిపోదోయి..

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అక్షరాస్యతలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు అట్టడుగు స్థానంలో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. అనేక గ్రామాలకు ఇప్పటికీ రహదారులు లేవు. ఇదే కారణంతో కొమరాడ మండలం చోళ్లపదం పంచాయతీ, రెబ్బ గ్రామానికి చెందిన కోలక సోమయ్య తమ కుమార్తెను బతికించుకునేందుకు కోసం వెదురు కర్రలతో తయారుచేసిన నావపై నాగావళి నది దాటాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆ ఒక్క గ్రామమే కాదు. పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం చేపట్టకపోడంతో సుమారు 15గ్రామాల ప్రజానీకం ఆపదలోనూ దవాఖానాలకు వెళ్లాలంటే ప్రాణాలకు తెగించాల్సిన పరిస్థితి ఎదురౌతోంది. అటు సాలూరు మండలంలోని కొఠియా ప్రాంతంలోనూ ఇప్పటికీ ప్రభుత్వ పథకాలు అందని పరిస్థితి. ఓటు కార్డులు తప్ప, రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులకు నోచుకోని కుటుంబాలెన్నో... వీరికి విద్య, వైద్య సదుపాయాలు అందకపోవడంతో ఇప్పటికీ పసరమందులే దిక్కుగా మారింది. ఇక రక్తహీనతతో తల్లీపిల్లల మరణాలు ఇటీవల ఎక్కువయ్యాయని అధికారుల సమీక్షలోనే ఇటీవల బయటపడింది. ఇప్పటికీ అంటరాని తనం, రెండు గ్లాసుల పద్ధతి అక్కడకక్కడా కనిపిస్తోంది. 76ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో కొన్ని సామాజికవర్గాలు, పేదలు తమకు జరుగుతున్న అన్యాయాన్ని స్వేచ్ఛగా చెప్పుకునే పరిస్థితి కూడా లేదు. ప్రభుత్వ విధానాల కారణంగా గతం కన్నా దోపిడీ, అవినీతి పెరింగింది. మరోవైపు నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇటీవల పెరిగిన టమాటా ధరలే ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. ఇంకోవైపు నిరుద్యోగం పెరిగింది. వయసు మీరుతున్నా ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో చదువుకున్నవారి పరిస్థితి సైతం దుర్భరంగా మారుతోంది. ఇటీవల కాలంలో నిరుద్యోగులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపట్టడమే ఇందుకు నిదర్శనం.

ఇలా స్వాతంత్ర్య అనంతరం జిల్లా అభివృద్ధి చెందినప్పటికీ 76ఏళ్లకు తగ్గట్టు లేదనేది ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయ కాముకుల వాదన. సుదీర్ఘ స్వాతంత్ర్య పోరాట పటిమను, వీరుల త్యాగఫలాన్ని విస్మరిస్తూ కేవలం సభలు చేసి సంబర పడడంతో సరిపెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీశ్రీ అన్నట్టు సాధించిన దానితో సంతృప్తి చెంద కుండా, అదే విజయమనుకుంటే సరిపెట్టుకోకుండా ప్రగతి దారులకై... సమసమాజ నిర్మాణమే ధ్యేయంగా... సకల జనుల సౌభాగ్యమే లక్ష్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.



రోడ్డు సౌకర్యం లేక డోలీ కట్టి రోగిని కిందికి తీసుకొస్తున్న మారిక గిరిజనులు

సచివాలయ వ్యవస్థతోనే గ్రామస్వరాజ్యం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి సచివాలయ వ్యవస్థతో మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామస్వరాజ్యం సాకారమైందని రాష్ట్ర హోంశాఖా మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని చినబొండపల్లిలో రూ.42లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామసచివాలయ భవనాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రోడ్‌షో నిర్వహించి ప్రజలనుద్ధేశించి మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఎంతో మంది ముఖ్యమంత్రులు మారినా, ఇంత పెద్దఎత్తున సంక్షేమ పథకాలు, అవినీతికి చోటులేకుండా ప్రజలఖాతాల్లో నేరుగా వేసిన చరిత్ర సిఎం జగన్‌మోహనరెడ్డిదేనని అన్నారు. కుల, మత, వర్గ బేధాలు లేకుండా పార్టీలకు అతీతంగా అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు రూ.2లక్షల కోట్లుకు పైగా అర్థిక సహాయం అందించారని, వైసిపి ప్రభుత్వా నికి ప్రజల్లో వస్తున్న ఆదరణచూసి ఓర్వలేక ప్రతిపక్షాలు జండా, ఎజండాలేకుండా విమర్శిస్తు న్నాయని అన్నారు. పేదల తలసరి ఆదాయం పెరగడమేకాకుండా, రాష్ట్ర జిడిపి గణనీయంగా పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రాబోయే ఎన్నికల్లో తమ నాయకుడు మళ్లీ సిఎం కావడం ఖాయమని, ఇంతకు పదిరెట్లుగా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలిపే సత్తా జగన్‌కు ఉందని అన్నారు. తొలుత స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ తాము గెలిస్తే ప్రజలకు ఏమిచేస్తామో, రాష్ట్రాన్ని ఏవిధంగా అభివృద్ధి చేస్తామో చెప్పకుండా రాష్ట్రంలోని కుహనా ప్రతిపక్షాలు అన్ని ఏకమై వైసిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలో రాకుండా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ప్రకటించడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గండి శంకరరావు, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్‌ఎంపిపిలు సిద్ధా జగన్నాధరావు, బంకురు రవికుమార్, ఆత్మ చైర్మన్ వై.తిరుపతి రావు, పెదబొండపల్లి పిఎసిఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, నాయకులు మజ్జిచంద్రశేఖర్, భీమవరపు కృష్ణమూర్తి, బొమ్మి రమేష్, మడక విశ్వనాధం, గ్రామస్తులు పాల్గొన్నారు.

హోంమంత్రి వనిత



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న హోంమంత్రి వనిత

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సోమవారం పరిశీలించారు. రాష్ట్ర హెూం శాఖ మంత్రి తానేటి వనిత ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగుర వేస్తారని తెలిపారు. పెరేడ్‌ను పరిశీలిస్తారని, సాంస్కృతిక కార్యక్రమాలు, శాఖల అభివద్ది సూచించే శకటాలు, ప్రదర్శన శాలలు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. పక్కాగా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. వేదికకు ఎడమ వైపున ప్రజా ప్రతినిధులకు, కుడి వైపున జిల్లా అధికారులు, అవార్డులు పొందిన వారికి కుర్చీలను ఏర్పాటు చేశారు. పరిశీలనలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, డిఆర్ఒ జె.వెంకటరావు, డిఆర్ఒ కె.హేమలత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, అధికారులు

హాస్టళ్లకు జిసిసి సబ్బులు సరఫరా చేయాలి

డిప్యూటీ సిఎంకు జిసిసి ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - సాలూరు

ప్రభుత్వ బిసి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు, కస్తూరిబా, జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలు, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో జిసిసి సబ్బులు, ఉత్పత్తులను వినియోగించేలా చూడాలని కోరుతూ సోమవారం జిసిసి సోప్ యూనిట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిప్యూటీ సిఎం రాజన్నదొరను కోరారు. యూనియన్ అధ్యక్షులు సిహెచ్.సంతోషికుమారి, కార్యదర్శి ఎన్.సుజాత ఆధ్వర్యాన సోప్ యూనిట్ ఉద్యోగులు డిప్యూటీ సిఎం రాజన్నదొరను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జిసిసి సబ్బులు తయారీ యూనిట్ విజయనగరంలో 16మంది ఉద్యోగులు పని చేసేవారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో విద్యార్థులకు జిసిసి సబ్బులు, ఇతర ఉత్పత్తులు సరఫరా జిసిసి ద్వారా సరఫరా జరిగేవని చెప్పారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఒడి పథకం కింద నేరుగా విద్యార్థుల తల్లులు ఖాతాల్లోకి నగదు బదిలీ చేయడంతో వసతి గృహాల్లో విద్యార్థులకు కాస్మెటిక్స్ నిలిపివేసినట్లు తెలిపారు. దీని వల్ల సోప్ యూనిట్లలో ఉత్పత్తుల వినియోగం నిలిచిపోయిందని, ఫలితంగా యూనిట్ మూతపడే స్థాయికి చేరుకుందని చెప్పారు. ఈ కారణంగా యూనిట్‌లో పనిచేసే ఉద్యోగులు ఉపాధి కోల్పోయారని చెప్పారు. కావున సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో సబ్బులు, జిసిసి ఉత్పత్తుల వినియోగం జరిగేలా చూడాలని యూనియన్ నాయకులు సంతోషికుమారి, సుజాత కోరారు. దీంతో అక్కడే వున్న జిసిసి డిఎం మహేంద్ర కుమార్‌ను పిలిచి సమస్య పరిష్కారమయ్యేలా విధివిధానాల గురించి రాజన్నదొర చర్చించారు. సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాజన్నదొర హామీ ఇచ్చారు.



రాజన్నదొరకు వినతిని అందజేస్తున్న జిసిసి సోప్ యూనిట్ వర్కర్స్ యూనియన్ నాయకులు

పేదల భూములు పెద్దలకు కట్టబెట్టేందుకే

అసైన్డ్ భూముల చట్టంలో మార్పులు : సిపిఎం

ప్రజాశక్తి - పాచిపెంట

పేదల భూములను పెద్దలకు కట్టబెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం 9/77 అసైన్డ్ భూములు చట్టాన్ని మార్పు చేయడం దుర్మార్గమని, ఇలాంటి విధానాలను తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. 2.50 ఎకరాలు భూమి ఉన్న పేదలందరికీ క్రమబద్ధీకరించాలని కోరుతున్నామని, ఈ భూములను అన్యాక్రాంతం చేసిన పెత్తందారులు, రియల్ ఎస్టేట్‌దారులకు భూస్వాములకు కట్టబెడితే జిల్లా వ్యాప్తంగా భూ పోరాటం భూములపై జెండాలు పాతి పేదల స్వాధీనం చేసుకుంటారని తెలిపారు. అసైన్డ్ భూములు పట్టాలు పొందిన రైతులంతా వారంలోపు తహశీల్దార్లకు దరఖాస్తు చేసుకొని తన భూములు కాపాడుకోవాలని కోరారు. అలాగే పాచిపెంట మండలంలో పద్మాపురంలో అసైన్డ్ భూముల్ని సాగు చేస్తున్న రైతులకు పట్టాలివ్వాలని కోరారు. కుడుమూరులో 748 ఎకరాల ప్రభుత్వ భూమి సర్వే చేసి పట్టాలివ్వకుండా మభ్యపెడుతున్నారని, వెంటనే సాగు చేస్తున్న గిరిజనులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొండ తాడూరులో 210 ఎకరాలు సిపిఎం పోరాట ఫలితంగా ప్రభుత్వం సర్వే చేపట్టిందని, సర్వే చేసిన భూమిని సాగుదారులైన రైతులందరికీ పట్టాలివ్వాలని కోరారు. జిల్లాలో ఇతర ప్రాంతాల్లో ఇలా అన్యాక్రాంతమైన భూములు, పేదల సాగు చేస్తున్న డి-పట్టా భూములకు పట్టాలివ్వాలని, ఇప్పటికే వ్యవసాయ కూలీలు పోరాడుతున్నారని అన్నారు. ఆ భూములను వెంటనే వారికి అప్పగించాలని, లేనిచో భూ పోరాటం చేపట్టి, ఆ భూములను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మర్రి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు



డిఇ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్

పాడైన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో రైతులు స్థానిక విద్యుత్ పంపిణీ సంస్థ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బివి రమణ, కరణం రవీంద్ర మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయని, వీటిని పునరుద్ధరించేందుకు కొత్త ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటుకు కనీసం చర్యలు చేపట్టకపోవడం విచారకరమని అన్నారు. గరుగుబిల్లి మండలంలో సుమారు 10 చోట్ల వ్యవసాయ విద్యుత్ ట్రాన్సాఫార్మర్లు కాలిపోయాయని, వీటి పునరుద్ధరణకు అనేక దఫాలుగా విద్యుత్ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో జిల్లాస్థాయి అధికారుల వద్దకు వచ్చి రైతుల పరిస్థితిని తెలియజేస్తున్నామని అన్నారు. వర్షాభావ పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో తక్షణమే పంట పొలాలకు సాగు నీరందించాల్సిన అవసరం ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా సమస్య పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ శాఖ డిఇ ఆఫీసు సూపరింటెండెంట్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో రైతులు కరణం సింహాచలం, పోలినాయుడు, అప్పలస్వామి పాల్గొన్నారు.

6 నాటికి నగదు రికవరీ : ఎఒ

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని చెముడు రైతు భరోసా కేంద్రంలో నగదు గోల్‌మాల్ వ్యవహారానికి సంబంధించి స్థానిక ఉద్యోగి నుంచి ఈనెల 16 నాటికి మొత్తం నగదు రికవరీ చేస్తామని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. ఈనెల 13న ఆర్‌బికెలో నగదు గోల్‌మాల్ అన్న శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు ఎఒ స్పందించారు. ఈ మేరకు సోమవారం జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో చైర్మన్ రంగనాయుడు వద్ద ప్రస్తావించారు. దీంతో ఆ ఉద్యోగిని పిలిచి బుధవారంలోగా పూర్తిగా నగదు జమ చేయాలని ఆదేశించారు. లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కలెక్టరు నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. నా నేల - నా దేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం పట్టణంలో బంధం వారి వీధిలో గల సెయింట్ పీటర్స్ పాఠశాల ఆవరణ నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీని కలెక్టరు ప్రారంభించారు. ర్యాలీ అనంతరం కలెక్టరు మాట్లాడుతూ నా నేల, నా దేశం కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ నిర్వహించామని, ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిచోటా శిలాఫలకాన్ని ఏర్పాటు చేశామన్నారు. దేశరక్షణలో ప్రాణాలర్పించిన, సేవలందిస్తున్న సైనికులను సన్మానించినట్టు తెలిపారు. ఈ ఏడాది ఈ దేశం మనకేమిచ్చింది, మాతృదేశానికి మనం ఏమి చేయాలనే నినాదంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో 75 మొక్కలు నాటాలని తెలిపారు. దేశానికి జాతీయ జెండాను రూపకల్పన చేసిన పింగళి వెంకయ్య ఆంధ్రుడేనని తెలిపారు. దేశభక్తి విషయంలో ఆంధ్రుల ప్రత్యేకమన్నారు. మంగళవారం నిర్వహిస్తున్న స్వాతంత్ర్యదినోత్సవవేడుకలలో ప్రజలందరూ పాల్గొనవలసినదిగా కోరారు. ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ స్వాతంత్ర్యదినోత్సవరం సందర్భంగా నా నేల - నా దేశం కార్యక్రమంలో గ్రామగ్రామాన జాతీయజెండాను ఎగురవేసి, దేశభక్తిని చాటుకున్నామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని తెలిపారు. బైక్ ర్యాలీ కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఆర్. గోవిందరావు, ప్రోజెక్టు అధికారి సి. విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని వండువ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే వీ కళావతి ఆధ్వర్యంలో నా భూమి నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్థూపం వద్ద నేల తల్లికి నమస్కారం వీరులకు వందనమంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.కల్యాణి, ఎపిఒ జి.సత్యంనాయుడు, రైతు ఉత్పత్తిదార్ల సంఘం అధ్యక్షులు జి.బలరాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



వీరఘట్టం : ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

నడిమికల్లలో...

వీరఘట్టం : మండలంలోని నడిమికల్ల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సర్పంచ్ డి.సుజాత ఆధ్వర్యంలో నా భూమి నా దేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన నా భూమి నా దేశం స్థూపం వద్ద ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి ఎన్.కోటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకి క్విజ్ పోటీలు

మండలంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు తలవరం, బిటివాడ, తెట్టంగి, తదితర పాఠశాలల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు పలు రకాల క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఆగస్టు 15 సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

కురుపాం : మండలంలోని బియ్యాలవలసలో నిర్వహించిన నా భూమి నా దేశం కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భముగా గ్రామంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించి అనంతరం స్వాతంత్ర సమరయోధులకు, పోలీస్ శాఖలో పనిచేసే అమరులైన వారికి, విశ్రాంతి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల గ్రామస్తుల సమక్షంలో శిలాఫలకాలు ఏర్పాటు చేసి ఆవిష్కరించి దీప అలంకరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అజారీ, జడ్పిటిసి జి.సుజాత, పంచాయతీ కార్యదర్శి కె.అనురాధ, జెఇ డిఎస్ఆర్‌వి మూర్తి, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

నా దేశం - నా మట్టిని పరిశీలించిన కమిషనర్

సీతానగరం : మండలంలోని పెదబోగిలి పంచాయతీ పరిధిలో గల అప్పయ్యపేటలో నా దేశం - నా మట్టి కార్యక్రమాన్ని రాష్ట్ర కమిషనర్ ఎం.అశోక్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ఎంతో మంది త్యాగం చేసిన కుటుంబాలను సత్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహించాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో డ్వామా పీడీ పి.రామచంద్రరావు, ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ప్రసాద్, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బైకు ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురులో ఆజాద్‌కీ అమృత్ మహోత్సవంలో భాగంగా "నా భూమి- నా దేశం" కార్యక్రమం జరిగింది. విద్యార్థులచే ప్రిన్సిపల్ పైల శంకర్రావు ప్రతిజ్ఞ నిర్వహించారు. కళాశాల ఆవరణను పరిశుభ్రం చేసి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అప్పారావు, సీనియర్ అధ్యాపకులు తేజేశ్వరరావు, గోవిందరావు, వెంకటేష్, రవిశంకర్ పాల్గొన్నారు.

గరుగుబిల్లి : స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ, తహశీల్దార్, పోలీసు స్టేషన్ వద్ద ఏర్పాట్లును పూర్తి చేశారు. అలాగే పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ఇటీవల విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు.



సీతానగరం : నాదేశం-నామట్టి స్థూపాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర కమిషనర్ అశోక్‌కుమార్



మానవహారం చేస్తున్న అంగన్వాడీలు

మణిపూర్‌లో శాంతి కోసం అంగన్వాడీల ర్యాలీ

ప్రజాశక్తి - సాలూరు

మణిపూర్‌లో శాంతి నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐటియు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు రాధ ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలు సంగీత పాఠశాల జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మణిపూర్‌లో మహిళలకు భద్రత కల్పించాలని, రక్షణ కల్పించాలని కోరారు. శాంతి నెలకొల్పడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్కడి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయ, వరలక్ష్మి, అరుణ, రమణమ్మ పాల్గొన్నారు.

గుమ్మ సర్పంచ్ బరిలో నలుగురు అభ్యర్థులు

ప్రజాశక్తి - కురుపాం

ఇటీవల ఖాళీ అయిన గుమ్మ సర్పంచ్ స్థానానికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఈ స్థానానికి నలుగురు అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఆర్ఒ పి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ బరిలో ఐదుగురు అభ్యర్థుల నామినేషన్ వేయగా సోమవారంతో విత్‌డ్రా సమయంతో ఒక అభ్యర్థి విత్‌డ్రా అవ్వగా ఆరిక గోపాలరావు, కొండ గొర్రి వెంకటరావు, తోట పట్టయ్య, నిమ్మక భాను ప్రసాద్ బరిలో ఉన్నారన్నారు. ఈనెల 19న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని బియ్యాలవలస పంచాయతీలో ఖాళీ అయిన వార్డు మెంబరు టి.భారతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్ఒ అర్.వేణుగోపాల్ తెలిపారు.



జాతీయ నాయకుల వేషాధారణలో విద్యార్థులు

అలరించిన జాతీయ నాయకుల వేషధారణ

ప్రజాశక్తి - సాలూరు

76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం స్థానిక శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఆనాటి స్వాతంత్ర్య సమరంలో పోరాడిన మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు తదితర నాయకుల వేషధారణలతో విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు విద్యార్థుల చేత దేశభక్తి గీతాలాపన, నాటికల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలగుడబ లక్ష్మి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

జిసిసి సేల్స్‌మేన్లను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన సహకార సంస్థలో పనిచేస్తున్న డిఆర్ డిపోల సేల్స్‌మేన్లను రెగ్యులర్ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ విజ్ఞప్తి చేశారు. గతంలో జిసిసిల్లో రెగ్యులర్ సేల్స్ మాన్లు ఉండేవారని, వీరంతా ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కొత్తగా సేల్స్‌మాన్ పోస్టులను నియామకం చేయకుండా కాంట్రాక్ట్ పద్ధతిపై రూ.20వేలు జీతంతో సేల్స్మెన్లు గా నియమించారని తెలిపారు. వీరందర్నీ రెగ్యులర్ సేల్స్‌మెన్లుగా నియమించి పూర్తిస్థాయి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సేల్స్‌మేన్లతో పాటు, సిసిపి ఎలు, ఆఫీసు స్టాఫ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ ఖాళీలన్నీ భర్తీ చేయాలని కోరారు. గిరిజనులు సేకరించే పలు రకాలైన అటవీ ఫలసాయాలకు గిట్టుబాటు ధర కల్పించడానికి జిసిసి అధికారులు తగిన చొరవ తీసుకోవాలని రమణ విజ్ఞప్తి చేశారు.

వాలంటీర్ల నియామకానికి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని ఆయా గ్రామాల సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వాలంటీర్లను నియమించేందుకు సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మేరకు ఆయా గ్రామ సచివాలయం పరిధిలో ఖాళీగా ఉన్న వాలంటీర్లను భర్తీ చేసేందుకు ఎంపిడిఒ జి.పైడితల్లి, ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు ఇంటర్వ్యూలు నిర్వహించారు. గరుగుబిల్లి సచివాలయం పరిధిలో మూడు వాలంటీర్లు, రావివలసలో ఒక పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. ఉల్లిభద్ర సచివాలయం పరిధిలో రెండు వాలంటీర్లు తోటపల్లి సచివాలయం పరిధిలో ఒక వాలంటీరు, సంతోషపురం పంచాయతీ సచివాలయం పరిధిలో ఖాళీగా ఉన్న ఒక వాలంటీర్ పోస్టును భర్తీ చేయనున్నామన్నారు. నాగూరు, మరుపెంట, పెదగుడబ, బురదవెంకటాపురం, చినగుడబ, కొంకడివరం, దలాయివలస, లఖనాపురం, రావుపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న ఒక్కొక్క వాలంటీర్ పోస్టును భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలను నిర్వహించడం జరిగిందని ఎంపిడిఒ పైడితల్లి పేర్కొన్నారు. ఎంపికైన వారికి త్వరలోనే ఆర్డర్లను అందజేయనున్నామన్నారు.

17 నుంచి సిపిఐ బస్సు యాత్ర

ప్రజాశక్తి - బెలగాం

ఈనెల 17 నుంచి జరగనున్న బస్సుయాత్రను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక సిపిఐ కార్యాలయంలో బస్సు యాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ఖనిజ సంపదను కార్పొరేట్లుకు అప్పనంగా అప్పజెప్పడాన్ని, మత విద్వేశాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య తగాదాలు సృష్టించే బిజెపి విధానాలను నిరసిస్తూ "దేశాన్ని రక్షించండి" రాష్ట్రాన్ని కాపాడండి అన్న రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర జరుగుతుందన్నారు. ఈ బస్సు యాత్ర సెప్టెంబర్ 8న తిరుపతిలో బహిరంగ సభ ను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇవి నాయుడు, గరుగుబిల్లి సూరయ్య, బుడిత అప్పలనాయుడు జిల్లా సమితి సభ్యులు, బిటి నాయుడు, పాల్గొన్నారు.

వర్షంతో రైతుల హర్షం

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గత పది రోజులుగా వర్షాల్లేక వరి పొలాల్లో నేర్రేలు బారియి. మరో నాలుగు రోజులు వర్షం పడకపోతే ఈ సీజన్లో వేసిన పత్తి పంట కూడా పాడైపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో అధిక పెట్టుబడులు పెట్టిన రైతులు వరుణుడు కోసం ప్రతిరోజూ ఎదురు చూడడం జరుగుతోంది. సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు



వర్షంతో వరిపొలాల్లో చేరుకున్న నీరు

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : రాజన్నదొర

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సిఎం పి.రాజన్న దొర అన్నారు. మండలంలోని కొటికిపెంట పంచాయతీ గోగాడవలస, చండివలస గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. అలాగే గ్రామాల్లో సమస్యలుంటే తెలియజేయాలని కోరారు. చండివలసలో శ్మశాన వాటికకు రహదారి నిర్మించాలని, లో వోల్టేజ్ సమస్య పట్టిపీడిస్తుందని ఈ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించి ఆయన సంబంధిత అధికారులను పిలిచి రెండు సమస్యలు త్వరగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.



బుక్‌లెట్‌ను అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

టిడిపి తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

అనంతరం గోగాడవలసలో విలేకరులతో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం_ కొంతమంది టిడిపి కార్యకర్తలు సామాజిక మాధ్యమాలల్లో అసత్య ప్రచారాలు, ట్రోల్ చేస్తున్నారని అటువంటి వారిపై అట్రాసిటీ, క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. కొటికిపెంట గ్రామస్తులకు ఇళ్ల నిర్మాణాల కోసం ఎన్నికల సమయంలో రూ.5లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు టిడిపి కార్యకర్తలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని తాను ఎప్పుడూ ఇలాంటి హామీ ఇవ్వలేదని తెలిపారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.1,80,000 మంజూరు చేస్తుందని, రూ.2,80,000 ఇస్తే బాగుంటుందని నాయకుల కోరిక మేరకు ఈ ప్రతిపాదనను ప్రభుత్వానికి రాసి పెట్టానని, రూ.5 లక్షలు మంజూరు చేస్తానని తానెక్కడా అనలేదని తెలిపారు. ఎన్నికల ముందు టిడిపి నాయకులు సాగునీటి ప్రాజెక్టులు పరిశీలించడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. పెద్దగెడ్డ, వెంగళ రాయ సాగర్, ఆంధ్ర జలాశయాల ద్వారా రెండు పంటలకు నీరు ఇవ్వాలని టిడిపి నాయకులు డిమాండ్ చేస్తున్నారని, సాగునీటి ప్రాజెక్టులపై అసలు వారికి అవగాహన ఉందా ఈ మూడు ప్రాజెక్టులు ఒక్క ఖరీఫ్ సాగుకే నీరు అందేలా డిజైన్ చేశారని రెండో పంట ఆరుతడి పంటలకు సాగునీరందించడం జరుగుతుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎంపిపి బి.ప్రమీల, వైసిపి నాయకులు ఇజ్జాడ అప్పలనాయుడు, దండి ఏడుకొండలు, డోల బాబ్జీ, పి.వీరమనాయుడు, తిరుపతి, టి.గౌరీశ్వరరావు, ఎంపిడిఒ జి.పార్వతి, ఎఒ తిరుపతిరావు, పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ఎపి ఎన్‌జిఒకౌన్సిల్ సమావేశాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ వాల్‌పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - కురుపాం

ఎపి ఎన్‌జిఒ కౌన్సిల్ సమావేశ గోడ పత్రికలను స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి చినమేరంగిలో గల తన అతిథి గృహంలో సోమవారం అసోసియేషన్ కురుపాం తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ బి.ప్రకాష్, సెక్రెటరీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్జీవో యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీల్లో ఉద్యోగుల సమస్యలు, కోరికలపై విజయవాడలో గల ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఎపి ఎన్జీవో స్టేట్ కౌన్సిల్ సమావేశం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ సమావేశానికి హాజరవుతారని, కావున పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జిఎం వలస, గరుగుబిల్లి మండలాల ఉద్యోగులు పాల్గొన్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేక అభివృద్ధి మందకొడిగా సాగుతున్నాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి సిబ్బంది వాంటెడ్ అనే పోస్ట్ విడుదల చేసి ఖాళీగా ఉన్న సిబ్బందిని నియమకాలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇటీవల ప్రభుత్వ ఆదేశాల మేరకు జరిగిన బదిలీల్లో భాగంగా సిబ్బంది వెళ్లిపోవడంతో పలు పోస్టులు ఖాళీ అయిపోవడంతో సేవలకు అంతరాయం ఏర్పడుతుంది. కీలకమైన కార్యాలయల సీనియర్, జూనియర్ అసిస్టెంట్లతో పాటు ఎఒ పోస్టులు కూడా ఖాళీగా ఉండడంతో పూర్తిస్థాయిలో పనిచేయలేకపోతున్నామని మిగిలిన సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పని చేసిన వారు బదిలీపై వెళ్లిపోగా మరికొంతమంది సెలవులపై ఉండడంతో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. ప్రస్తుతం ఈ కార్యాలయంలో ఎంపిడిఒతో పాటు టైపిస్టు అందుబాటులో ఉండడం చూస్తే ప్రజలకు సేవలు ఏ విధంగా అందుతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. సచివాలయాల ద్వారా సేవలు అందిస్తున్నప్పటికీ ఎంపీడీవో కార్యాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారు కాస్త బయట పనులకు వెళ్లడం వల్ల అనేక పనులు పెండింగ్లో ఉన్నట్లు సమాచారం. కొత్తగా వచ్చిన ఎంపిడిఒకు మండలంపై పూర్తి అవగాహన లేకపోవడం, పూర్తి స్థాయిలో ఉద్యోగులు లేక మండల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని నాయకుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల పరిషత్ కార్యాలయానికి పూర్తిస్థాయిలో సిబ్బంది నియమించాలని కోరుతున్నారు.

స్పందనకు 80 ఫిర్యాదులు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 80 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకట రావు ప్రజల నుండి వినతులను స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువగా భూసమస్యలు, వ్యక్తిగత, ఇతర సమస్యలపై ఉన్నాయి. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

పార్వతీపురంరూరల్ : స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భముగా ఆయన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదే పదే పోలీసు స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండకూడదని, బాధితులకుతక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందనలో ఆరు ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఎఎస్పీ (అడ్మిన్) ఒ.దిలీప్ కిరణ్, ఎస్బి సిఐ సిహెచ్.లక్ష్మణరావు, డిసిఆర్‌బి సిఐ ఎన్‌వి ప్రభాకర్‌రావు, ఎస్ఐ పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనకు 66 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎ స్పందన కార్యక్రమానికి 66 వినతులు వచ్చాయి. సోమవారం స్పందన కార్యక్రమం పిఒ కల్పనాకుమారి ఆధ్వర్యంలో జరిగింది. వచ్చిన వినతుల్లో కొన్ని... సిరిగూడకు చెందిన రాజబాబు ఆటోలోను మంజూరు చేయాలని, పొంజాడకు చెందిన సరస్వతి చీపుర్ల రుణం ఇప్పించాలని కోరారు. నడిమిగూడకు చెందిన చిన్న లక్ష్మయ్య మేకల్లోను, మామిడి గూడకు చెందిన భాస్కరరావు కిరాణా షాపునకు రుణాలు ఇప్పించాలని కోరారు. సోలికిరికి చెందిన తెరిసా అంగన్వాడి కేంద్రం మంజూరు చేయాలని, చీమల గూడకు చెందిన జయ ప్రకాష్ సవర భాష వాలంటీర్ పోస్ట్ ఇప్పించాలని కోరారు. కిట్టలపాడుకు చెందిన లక్ష్మయ్య పవర్ వీడర్ మంజూరు చేయాలని పిఒ దృష్టికి తీసుకొచ్చారు. స్పందన కార్యక్రమంలో ఎపిఒ రోషిరెడ్డి, డిడి శ్రీనివాసరావు, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.సింహాచలం, డిప్యూటీ డిఎంహెచ్ఒ చిరంజీవి, జిసిసి డిఎం సంధ్యారాణి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా టిడిపి

మహాశక్తి కార్యక్రమంలో జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారానికి వస్తే యువత, మహిళలు, పేదలకు అండగా ఉంటుందని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని లక్కగూడలో మహాశక్తి కార్యక్రమాన్ని సోమవారం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో మహాశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. అనంతరం టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ కార్యదర్శి అడ్డాకుల నరేష్, నాయకులు కద్రక కళావతి, పలువురు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



లక్కగూడలో మహాశక్తియాత్ర నిర్వహిస్తున్న జగదీశ్వరి

ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టో మహాశక్తి, యువగళం అన్నదాత కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, కోలా బాబు, డాక్టర్ భానుప్రసాద్, బోను చంటి తదితరులు పాల్గొన్నారు.

అడ్డాపుశిలలో టిడిపి భవిష్యత్తుకు గ్యారెంటీ

పార్వతీపురం రూరల్ : మండలంలోని అడ్డాపుశీలలో సోమవారం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పిన్నింటి రామినాయుడు వలస, అడ్డాపుశీల గ్రామాల్లో మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ద్వారపురెడ్డి జగదీష్, బొబ్బిలి చిరంజీవులుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు మజ్జి గౌరయ్య ఆధ్వర్యంలో వందమంది టిడిపిలో చేరారు.

అక్రమ కట్టడాలపై పోరాటం : సిఐటియు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని గొడగల వీధిలో అక్రమ కట్టడాలపై పోరాడుతామని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గొడగల వీధిలో గ్రామకంఠానికి చెందిన భూములు పెద్దల చేతుల్లో ఉన్నాయని, నాయకుల అండతో ఒక వ్యక్తి 26 సెంట్లు స్థలం తన ఆధీనంలోకి తీసుకున్నారని, ప్రభుత్వ స్థలం ఆక్రమించుకున్నారని అన్నారు. అందులో ఉన్న ఒక మిల్లును అక్రమ కట్టడంగా అధికారులు గుర్తించారని, ఇటీవలే దాన్ని సీజ్ చేసి మళ్లీ ఆ మిల్లు ఆ వ్యక్తికే చెందుతుందని నిర్ధారించడంపై పలు విమర్శలు వస్తున్నాయని తెలిపారు. అలాంటప్పుడు ఆ మిల్లును ఎందుకు సీజ్ చేశారని ప్రశ్నించారు. దీనిపై అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలు సెంటు స్థలం ఆక్రమించుకుంటే అధికారులు ఖాళీ చేయిస్తున్నారని, అటువంటిది 26సెంట్లు ఒకే వ్యక్తి ఆక్రమించుకుంటే అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించుకుంటే అధికారులు ఉదాసీనంగా ఉండడం సరికాదని అన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని రమణారావు డిమాండ్ చేశారు.



సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

సచివాలయ సిబ్బందిని నియమించాలని ధర్నా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీలో ఒకటి, రెండు సచివాలయాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో దుడ్డుఖల్లు సచివాలయం ఎదుట గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మండంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పంచాయతీలో 2500 మంది ఓటర్లు, 10వేలకు పైగా జనాభా ఉన్నారని తెలిపారు. అయితే సచివాలయం ఏర్పాటు నుంచి ఇక్కడ కేవలం వెల్ఫేర్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్, మహిళా పోలీస్, పంచాయతీ సెక్రెటరీ నలుగురు సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్యంగా డిజిటల్ అసిస్టెంట్ పోస్ట్ లేకపోవడంతో ప్రజలకు అవసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందడంలేదన్నారు. దీంతో గిరిజనులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పక్షపాతిగా వ్యవహరిస్తూ నలుగురు సిబ్బందితోనే విధులు నిర్వహించడమేమిటని ప్రశ్నించారు. ఉన్నత అధికారులు స్పందించి దుడ్డుఖల్లు పంచాయతీలో రెండో సచివాలయం కూడా ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పువ్వల తిరుపతిరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని ఎంఆర్ నగరం ఉన్నత పాఠశాలకు, చిన్న బొండపల్లికి చెందిన హౌసింగ్ ఎఇ పోతుల విజయకుమార్ జ్ఞాపకార్థం అతని భార్య లక్ష్మి రూ.30వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను విద్యార్థుల ఉపయోగం కోసం వితరణ చేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.విజయ్‌కుమార్‌కు మైక్ సెట్‌ను అందించారు.

తులసి గ్రామానికి లింక్ రోడ్డు వేయాలి

ప్రజాశక్తి - బెలగాం

కురుపాం మండలం తిత్తిరి పంచాయతీ తులసి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ గిరిజనులు సోమవారం స్థానిక ఐటిడిఎ పిఒకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవ మాట్లాడుతూ తులసి గ్రామానికి రోడ్డు లేకపోవడంతో సకాలంలో వైద్య సదుపాయాల్లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన తులసి నేరేడుమానుగూడా, తుమ్మిమానుగూడా, తులసి గ్రామాల్లో సుమారు 100 కుటుంబాల నివసిస్తున్నాయని, ఈ ప్రాంతానికి రోడ్డు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, వెంటనే రోడ్డు వేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, మండంగి సింగన్న, ఆరికి నాగభూషణం, సూర్యనారాయణ, బాలరాజు, బొడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

రోగనిర్ధారణ పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గ్రామంలో రోగ నిర్ధారణ పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు పక్కగా నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. మండలంలోని ఉద్దవోలులో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. రోగులకు నిర్వహించిన ఆరోగ్య తనిఖీలు, పరీక్షలు పరిశీలించారు. రోగుల చెప్పే అనారోగ్య సమస్యలను పూర్తి స్థాయిలో వినాలని, తద్వారా ఖచ్చితమైన వైద్య సేవలు అందజేయవచ్చన్నారు. బిపి, షుగరు, హెమోగ్లోబిన్, జ్వర నిర్ధారణ పరీక్షలు, వాటి ఫలితాలు రికార్డులో స్పష్టంగా ఉండాలన్నారు. సీజనల్ రోగాలు ప్రబలే అవకాశాలున్నందున మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు, అవసరమైన మందులు అన్ని గ్రామాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు సర్వే చేసి జ్వరాలను గుర్తిస్తే వెంటనే చికిత్స అందజేసి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అక్కడ రోగులు, గర్భిణులతో డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడి వారి ఆరోగ్య వివరాలు, అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సాగర్ వర్మ, సూపర్ వైజర్స్ ఉదయకుమారి, జయగౌడ్, వైద్య సిబ్బంది పార్వతి, మౌనిక, రమేష్, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, అనిల్, ఆశా కార్యకర్తలు ఉన్నారు.



వైద్యాధికారికి సూచనలు ఇస్తున్న డిఐఒ జగన్మోహనరావు

నడుకూరులో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని నడుకూరులో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఓ.శాంతకుమారి, ఎఎన్ఎం సరస్వతి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను రక్షించండి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

జిల్లాలో విలువైన ప్రభుత్వ భూములను, చెరువులను, స్థలాలను రక్షించాలని జనసేన నాయకులు కోరారు. సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావును జనసేన నాయకులు వంగల దాలినాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్ కలిసి జిల్లాలో జరుగుతున్న చెరువులు, ప్రభుత్వం భూములు, స్థలాలు కబ్జాలపై చర్చించారు. బెలగాంలోని లక్ష్మనాయుడు చెరువు, ఎమ్మార్ నగరంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. అక్కడి ప్రజాప్రతినిధులే ఈ ఆక్రమణలకు పాల్పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. తక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ కె.హేమలతను ఆదేశించారు.

వర్షాభావం నుంచి కాపాడుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మెట్ట వరి నారు, మొక్కజొన్న పంటలను ప్రకృతి సేద్య పద్ధతుల ద్వారా కొంతవరకు కాపాడుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పి.కోనవలస, కొటికిపెంటలో మొక్కజొన్న, వరి నారుమడులను పరిశీలించిన అనంతరం ప్రస్తుతం మండలంలో పంటలు బెట్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నాయని, వీటి నివారణ మార్గాలను రైతులకు సూచించాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. ఆవు పేడ, మూత్రం, ఇంగువ ద్రావణం పిచికారీ చేయడం ద్వారా బెట్ట పరిస్థితుల నుండి పంటలను 15 రోజుల వరకు కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు లక్ష్మణరావు, నాగమణి పాల్గొన్నారు.



కిశోర్‌చంద్రదేవ్ సమక్షంలో చేరిన వార్డుసభ్యురాలు సరస్వతి, నాయకులు

టిడిపిలో చేరిన వైసిపి వార్డు సభ్యులు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీ కురుపాం-4వ వార్డ్‌కు చెందిన సభ్యురాలు నెలిపురి సరస్వతి కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ సమక్షంలో టిడిపిలో సోమవారం చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చందక రామకృష్ణ, బండి రాజు, సువ్వాన గోవింద, మిన్నారావు, సువ్వాన వెంకటరావు, సీతారాం, పవన్, విజయ్, శ్రీను, మురళీ, రాజు అప్పారావు, క్రాంతి, సురేష్ కుమార్, రాజశేఖర్, పోలి శంకర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

సీతంపేట: మండలంలోని గోయిది సమీపాన ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో బైక్ మీద వెళ్తున్న పి.వసంత (18) మృతి చెందింది. వివరాల్లోకెళ్తే బూర్జ మండలం లాభం గ్రామానికి చెందిన వెంకటేష్, గుత్తవిల్లికి చెందిన పైడి వసంతి పాలకొండలోని ఒకే కాలేజీలో డిగ్రీ చదువుతున్నారు. సోమవారం వీరు బైక్‌పై సీతంపేట పార్క్ నుంచి తిరిగి ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొంది. దీంతో ఇద్దరూ అపస్మాత స్థితిలో ఉండటంతో 108 వాహనం ద్వారా పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా వసంత మార్గమధ్యలోనే మృతి చెందింది.అకస్మాత స్థితిలో వెంకటేష్ చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీతంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.